www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 20 జులై 2024
5
అన్నమయ్య



చంద్రప్రభ వాహనంపై సౌమ్యనాథుడు

ప్రజాశక్తి - నందలూరు

నందలూరులోని సౌమ్యనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడవ రోజు శుక్రవారం ఉదయం కల్యాణాలంకారంలో సూర్యప్రభ వాహనంపై మాడవీధుల్లో తిరుగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి కృష్ణుడి అలంకారంలో చంద్రప్రభ వాహనంపై శ్రీసౌమ్యనాథ స్వామి మాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయం ఎదురుగా ఉన్న సౌమ్యనాథ అన్నదాన ట్రస్ట్‌లో బ్రహ్మోత్సవాలకు విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు శనివారం ఉదయం శ్రీదేవి భూదేవి సమేత సౌమ్యనాథ స్వామి కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్ కుమార్ తెలిపారు.



పాల బిల్లులు రాక పరేషాన్



అమూల్ డెయిరీ వద్ద నిరసన తెలుపుతున్న పాడి రైతులు

- మూడు నెలలుగా ఎదురుచూపులు
- దాణాకు డబ్బులు లేక పాడి రైతుల అవస్థలు
- అమూల్ డెయిరీకి తాళం వేసిన రైతులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆరుగాలం కష్టపడిన రైతులకు సకాలంలో బిల్లులు అందకపోతే కుటుంబ పోషణ భారమైపోతుంది. మూడు నెలల పాటు 27 మంది రైతులకు రూ.3 లక్షల బిల్లులు పెండింగ్‌లో పడిపోతే పరిస్థితి ఎంత దయనీయంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఈ క్రమంలోనే మూడు నెలల పాల బిల్లు కోసం రైతులు పాల డెయిరీని ముట్టడించారు. వెంటనే తమకు బిల్లులు చెల్లించాలని నిరసన తెలుపుతూ స్థానిక బెంగుళూరు రోడ్డులోని అమూల్ డెయిరీకి తాళాలు వేసి ఆందోళన నిర్వహించారు. చిప్పిలి వద్ద అమూల్ పాల డెయిరీని ప్రభుత్వ అనుబంధంగా నిర్వహిస్తోంది. ఈ డెయిరీకి కురబలకోట మండలం, అంగళ్లు గ్రామం, గౌనివారిపల్లె నుంచి రైతులు పాలను సేకరించి పంపుతుంటారు. సుమారు 27 మంది రైతులు ఈ డెయిరీకి ప్రతిరోజు పాలను విక్రయిస్తారు. వీరికి ప్రతి 15 రోజులకు ఒకసారి డెయిరీ మేనేజ్ మెంట్ బిల్లులు చెల్లిస్తుంది. మూడు నెలలుగా రైతులకు అందాల్సిన రూ.3 లక్షల బిల్లులు అందక పోవడంతో తీవ్ర ఇబ్బందికర పరిస్థితుల్లోకి వెళ్లిపోయారు. పాడి ఆవులను పోషించడం, వాటికి పచ్చగడ్డి, దాణా వంటి వాటిని కొనుగోలుకు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొందని వాపోయారు. పాల బిల్లుల వల్లే కుటుంబ పోషణ జరుగుతుండడంతో కుటుంబం పూట గడవడం కష్టంగా మారింది. ఈ క్రమంలో రైతులు శుక్రవారం అమూల్ పాల డెయిరీకి చేరుకున్నారు. మేనేజర్‌ను సంప్రదించి బిల్లులు ఇవ్వాలని కోరడంతో నిర్లక్ష్య సమాధానం ఎదురైంది. బిల్లులు రాకపోతే పాలు వేయొద్దంటున్న మేనేజర్ మాట తీరును రైతులు తీవ్రంగా తప్పుపట్టారు. రైతులు ఆగ్రహించి పాల డెయిరీ గేట్లకు తాళాలు వేసి తమకు బిల్లులు చెల్లించే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదంటూ ఆందోళన నిర్వహించారు. సమస్యను తెలుసుకున్న టిడిపి నాయకులు బీదం గురునాథ్ యాదవ్, చంద్రాయుడు, సిమెంట్ రమణ సంఘటనా స్థలానికి చేరుకొని మేనేజర్‌తో మాట్లాడారు. స్పందించిన మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్లు కొన్ని సాంకేతిక కారణాలవల్ల బిల్లుల ఆలస్యం జరిగిందని, మరో 24 గంటల్లో సమస్యను పరిష్కరించి అందరికీ బిల్లులు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పడంతో సమస్య సద్దుమణిగింది. సూపర్‌వైజర్ కిరణ్ చేసిన కొన్ని మోసాల వల్ల రైతులకు సకాలంలో బిల్లు పడలేదని తెలుస్తోంది. రైతులకు చెందాల్సిన దాణా మూటలను సైతం కిరణ్ మూడో పార్టీకి అమ్ముకొని సొమ్ము చూసుకుని ఇక్కడ నుంచి ఉద్యోగం మానేయడంతో రైతులకు ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నట్లు కొంతమంది రైతులు తెలిపారు. ఏదిఏమైనప్పటికీ రైతులు ఆరుగాలం కష్టపడి విక్రయించిన పాలకు డబ్బులు ఇవ్వకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఇకనైనా యాజమాన్యం రైతుల కష్టాలను గుర్తించి సకాలంలో బిల్లులు చెల్లించాలని పలువురు కోరుతున్నారు.

నెలకు రూ.9 వేలు బిల్లు రావాలి

కుటుంబం పాల బిల్లుతోనే నడుస్తోంది. రోజుకు 10 లీటర్ల పాలు చొప్పున నెలకు 300 లీటర్ల పాలు వేస్తాను. రూ.9 వేల వరకు బిల్లు వస్తుంది. అందులో రూ.5 వేలు ఖర్చులు పోగా రూ.4వేలు మిగులు తుంది. అది కూడా రాకపోతే కుటుంబం ఎట్లా గడిచేది. ఇప్పటికి రూ.27 వేలు రావాలి. తీవ్ర ఇబ్బంది పడు తున్నాం.



- రైతు సుదర్శన్‌రెడ్డి, గౌనివారిపల్లి.

పాలు వేయొద్దనడం సరికాదు



పాల ద్వారానే మా కుటుంబం నడు స్తుంది. నెలకు రూ.15 వేలు బిల్లు వస్తుంది. మూడు నెలలుగా నిలిపివేశారు. బిల్లు కోసం మేనేజర్‌ను అడిగితే పాలను వేయొద్దంటూ దురు సుగా జవాబిస్తున్నాడు. పాలను నిలిపేయాలంటే ఎక్కడికివెళ్లి పోయాలి. సకాలంలో బిల్లులు వచ్చేలా చూడాలి.

-రైతు భానుప్రకాష్‌రెడ్డి, గౌనివారిపల్లె.

మోసం చేసిన సూపర్‌వైజర్

ఇక్కడ పనిచేస్తున్న సూపర్వైజర్ కిరణ్ రైతులకు అందాల్సిన దాణా మూటలను బయట విక్రయించి సొమ్ము చేసుకున్నాడు. ఆ డబ్బులు కూడా రైతు ఖాతాల్లో కోత విధించారు. మూడు నెలలు బిల్లు ఇవ్వక పోతే రైతు కుటుం బాలు ఎలా గడు స్తాయి. మేనే జర్‌తో మాట్లాడితే కొన్ని కారణాల వల్ల ఆలస్యం అయినమాట వాస్తవమే.



- బీదం గురునాథ్ యాదవ్, టిడిపి నాయకులు.

24 గంటల్లో బిల్లులు చెల్లిస్తాం

పాల డెయిరీలో బిల్లులు చెల్లించే విషయంలో సాంకేతిక కారణాలు చోటు చేసుకున్నాయి. రైతులకు బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం జరిగిన మాట వాస్తవమే. ప్రతి రైతుకూ 24 గంటల్లోగా పాల బిల్లులు మొత్తం చెల్లింపు చేసి సమస్యను పరిష్కరిస్తాం. ఇలాంటి సమస్య మరోసారి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటాం.



- లక్ష్మీకాంత్, అమూల్ అసిస్టెంట్ మేనేజర్.

అర్హులందరికీ 'ఉపాధి' పనులు : మంత్రి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-చిన్నమండెం

అధికారులు పారదర్శకంగా ప్రభుత్వ పథకాలు అమలు చేసి పేదల సంక్షేమానికి కృషి చేయాలని రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల సమావేశ భవనంలో మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూగతంలో అభివృద్ధికి నోచుకోని చిన్నమండెం మండ లంలో ప్రభుత్వ పథకాలు అమలు చేసి పేదల సంక్షేమానికి కృషి చేయాలన్నారు. అధికారులకు ఎటువంటి సమస్యలు వచ్చినా వెంటనే తమ దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవచ్చన్నారు. మండలంలో నీటి సమస్య తలెత్తకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. నీటి సరఫరాకు సంబంధించి పైప్లైన్ లీకేజీ ఉన్నట్లయితే వెంటనే మర మ్మతులు చేపట్టాలన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్త కుండా ఆర్‌టిసి బస్సులు సకాలంలో నడపాలని బస్టాండ్ పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచి బస్టాండ్‌లో ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా అర్హులైన పేదలందరికీ జాబ్ కార్డులు మంజూరు చేసి పని కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని పేదల కోసం సమర్థవం తంగా నిర్వహిస్తోందని ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతం లోని ప్రజలకు మెరుగైన జీవనోపాధి కల్పించే విధంగా సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు. పనిచేసే ప్రాంతంలో కూలీలకు ప్రభుత్వ నియమ నిబంధన ప్రకారం అన్ని వసతులు ఉండేటట్లు చూడాలన్నారు. అధికారులు ఉపాధి హామీ పథకం పనుల నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గతంలో ఇచ్చిన హామీ ప్రకారం యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో మెగా డీఎస్సీ ద్వారా గతంలో ఎన్నడూ లేని విధంగా 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేసేందుకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. దీపం పథకం ద్వారా అరుపులైన పేద కుటుంబాలకు గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేసిన ఘనత మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. అదేవిధంగా డ్వాక్రా గ్రూపులు ఏర్పాటు చేసి డ్వాక్రా మహిళలకు తక్కువ వడ్డీకే రుణాలు అందజేసి డ్వాక్రా సంఘాలను బలోపేతం చేయడం జరిగిందన్నారు. హౌసింగ్ అధికారులు ఇల్లు లేని ప్రతి పేదవారికి ఇల్లు మంజూరు చేసేందుకు కృషి చేయాలని ప్రస్తుతం వివిధ దశలలో ఉన్న ఇళ్ల నిర్మాణాలను త్వరితగతను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. రాబోయే రోజులలో కుల, మత, ప్రాంత భేదాలు లేకుండా అధికారులు ప్రభుత్వ పథకాలు అమలు చేసి జిల్లా అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సిఇఒ రమణారెడ్డి, ఎంపిపి సుధా మాధురి, ఎంపిడిఒ రామకృష్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విశ్లేషణాత్మక అధ్యయనాన్ని అలవర్చుకోవాలి



విద్యార్థులతో కలిసి భోంచేస్తున్న కలెక్టర్, డిఇఒ

కోటపల్లి జడ్‌పిహెచ్ పాఠశాల ఆకస్మిక తనిఖీలో కలెక్టర్ శ్రీధర్

సొంత నిధులతో సైన్స్ ల్యాబ్ సమకూరుస్తానని హామీ

ప్రజాశక్తి-పీలేరు

విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్తు కోసం విశ్లేషణాత్మక అధ్యయనాన్ని అలవర్చుకోవాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అన్నారు. మండలంలోని కోటపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను శుక్రవారం కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాల మధ్యాహ్న భోజన పథకం, పాఠశాల స్టాక్, పాఠ్యాంశాల ప్లాన్ రిజిస్టర్లతో పాటు ఇతర రికార్డులను పరిశీలించారు. పాఠశాలలో పిల్లలకు యూనిఫార్మ్, షూస్, స్కూల్ బ్యాగ్, పాఠ్య పుస్తకాలు, డిక్షనరీ, నోటు పుస్తకాలు, వంటివి వచ్చాయా లేదా అని ప్రధానోపాధ్యాయుడు శివశంకరయ్యను అడిగి తెలుసుకున్నారు. విద్యా సామగ్రిని పిల్లలకు త్వరగా అందజేయాలని హెచ్‌ఎంను ఆదేశించారు. మరుగుదొడ్ల నిర్వహణా నిధులతో పాఠశాలను పరిశుభ్రంగా ఉంచడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విధులు సరిగ్గా నిర్వర్తించని ఎంఇఒ పద్మావతికి షోకాస్ నోటీసు జారీ చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాష్‌రెడ్డిని ఆదేశించారు. అనంతరం 10వ తరగతి పిల్లల తరగతి గదికి వెళ్లి ఆర్థిక వ్యవస్థపై విద్యా ర్థులకు పలు ప్రశ్నలు అడిగి వారు చెప్పిన జవాబులతో ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు. విశ్లేషణాత్మకంగా తమకు తాము ప్రశ్నలు వేసుకుని ఇంకా బాగా చదివితే విషయాలను మరింత చక్కగా అర్థం చేసుకోవచ్చని పిల్లలకు సూచించారు. అనంతరం కలెక్టర్ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి పిల్లలతో కలిసి మధ్యాహ్నం భోంచేశారు.

విద్యార్థులతో కలిసి భోజనం తిన్న కలెక్టర్

కలెక్టర్ చామకూరి శ్రీధర్ విద్యార్థులతో కలిసి భోజనం చేసిన తర్వాత వారితో కాస్సేపు ముచ్చటించారు. పాఠశాల వసతులు, ఉపాధ్యాయుల పనితీరు, పాఠశాల సమస్యలపై విద్యార్థులను ప్రశ్నించారు. 10వ తరగతికి చెందిన యువతేజ, గురు చరణ్ స్పందిస్తూ తమ పాఠశాలకు సైన్స్ ల్యాబ్ కేటాయిస్తే, తాము మరింత బాగా చదువుకో ఉంటామని చెప్పారు. కలెక్టర్ వెంటనే స్పందించి తన నిధులతో స్కూల్లో సైన్స్ ల్యాబ్ ఏర్పాటు చేయిస్తానని పిల్లలకు భరోసా ఇచ్చారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ తనిఖీలో జిల్లా విద్యాశాఖ అధికారి శివ ప్రకాష్‌రెడ్డి, ఎడి ప్రసాద్ బాబు, పీలేరు మండల తహశీల్దారు మహబూబ్ బాష, ఎంఇఒలు లోకేశ్వర్‌రెడ్డి, పద్మావతి, కోటపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివశంకరయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఈద్గాలో పూలచాదర్ సమర్పిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి : 'మండిపల్లి'

ప్రజాశక్తి-రాయచోటి

కులమతల అతీతంగా ప్రజలంతా సురక్షంగా ఉండాలని రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రొట్టెల పండగను పురస్కరించు కొని ఈద్గా వెనకవైపు ఉండే జమాలుల్లా బాబా దర్గాలో పూలచాదర్‌ను మౌలిసాబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అక్కడికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గ ప్రజలందరూ కుల మతాల కచ్చితంగా సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నాను అన్నారు. రొట్టెల పండుగ సందర్భేగా దర్గా దగ్గరికి వచ్చిన వందలాది మంది మహిళలు పలు సమస్యలను మంత్రికి విన్నవించారు. ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మైనార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పిల్లల సంరక్షణపై బాలింతలకు అవగాహన

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విజయనగర్ కాలనీ అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం భేటి బచావో, భేటి పడావో వంద రోజుల బాలికల అవగాహనా కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సూపర్వైజర్ శాంతమ్మ, వర్కర్ భాగ్యమ్మ లు భేటీ బచావో బేటి పడావో అనే కార్యక్రమంపై ఆడపిల్లల్ని ఎలా కాపా డుకోవాలి, రక్షించుకోవాలి, పెంచుకోవాలి అనే విషయంపై వివరించారు. బాల్య వివాహాల వలన జరిగే అనర్థాలను ప్రజలకు తెలిపారు. ప్రస్తుత సీజనల్ వ్యాధులు డెంగీ, మలేరియా, టైఫాయిడ్, దగ్గు, జలుబు తదితర వ్యాధుల గురించి తెలిపారు. వాటి నుండి బాల బాలికలను ఎలా రక్షించుకోవచ్చో తెలియజేశారు. మన పరిసర ప్రాంతాలలో అనుకూలమైన చోట్ల కూరగాయల చెట్లు, ఆకుకూరలు, పండ్లనిచ్చే చెట్లను నాటుకుని సంరక్షించు కోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రం వద్ద అల్లనేరేడు మొక్కలను నాటి నీరు పోశారు. ఆరు నెలలు పూర్తయిన పిల్లలకి ఎటువంటి ఆహారమైనా అలవాటు చేయొచ్చని వివరిస్తూ అన్నప్రాసన కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం నూర్జహాన్, ఆశ వర్కర్ పుణ్యవతి పాల్గొన్నారు.

పాఠశాలకు సౌండ్ సిస్టమ్ వితరణ

ప్రజాశక్తి-రాయచోటి

పట్టణంలోని అలీమాబాద్ ఉర్దూ ఉన్నత పాఠశాలకు శుక్రవారం రిటైర్డ్ ప్రధాన ఉపాధ్యాయులు రామ్మోహన్‌రెడ్డి, ఇంగ్లీష్ ఉపాధ్యాయులు శ్రీనివాసులు ఇరువురు రూ.20 వేలు విలువ చేసే సౌండ్ సిస్టమ్‌ను పాఠశాలకు వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో అనేక సాంస్కృతి కార్యక్రమాలతో పాటు ఉదయము జరిగే పాఠశాల ప్రార్థన సమావేశానికి కూడా ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని వారు తెలియజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాబీర్, ఉపాధ్యాయ బృందం వీరు ఇరువురిని అభినందించి దుశ్శాలవలతో సన్మానించారు. కార్యక్రమంలో మహమ్మద్ ఇలియాస్, మహమ్మద్‌బాషా, జయన్న, జగదీశ్వరచారి, అబ్దుల్ రహీంఖాన్, చాన్‌బాషా, రహమతుల్లా, నరసరాజు, రాజబాబు పాల్గొన్నారు.



సౌండ్ సిస్టమ్ వితరణ చేస్తున్న రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు

మెడికల్ కళాశాల నిర్మాణ పనులను ఆపేయండి

- ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



మెడికల్ కళాశాల పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మెడికల్ కళాశాల నిర్మాణ పనులను తక్షణమే నిలుపుదల చేయాలని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అధికారులను ఆదేశించారు. మదనపల్లె రూరల్ మండలం శానిటోరియం దగ్గర నిర్మాణం జరుగుతున్న ప్రభుత్వ మెడికల్ కళాశాలను శుక్రవారం ఎమ్మెల్యే సందర్శించారు. అక్కడ జరుగుతున్న పనులను సమీక్షించి అధికారులతో మాట్లాడారు. కళాశాల నిర్మాణ పనులు, నాణ్యతను నిశితంగా పరిశీలించారు. కట్టడాలు సరిగ్గా లేవని, పిల్లర్లు ఆకారం సరిగ్గా లేదని, ఇటుక, ఇసుకలో నాణ్యత లేదని అసంతృప్తిని వ్యక్తం చేశారు. నాణ్యత లేని సరుకును సప్లై చేస్తున్న వారి పైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వెంటనే జరుగుతున్న పనులన్నీ ఆపేయాలని సూచించారు. అలాగే క్వాలిటీ కంట్రోల్ బృందం వచ్చి పనుల్లో నాణ్యతను పరిశీలించి నిర్ధారించవలసిందిగా అధికారులకు తెలియజేశారు. ఎంతో మంది వైద్య విద్యార్థులను తయారు చేసే కాలేజ్ ను ఉన్నత ప్రమాణాలతో నిర్మించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఎక్కడా రాజీ పడే ప్రసక్తే లేదని, మదనపల్లె నియోజకవర్గానికి మెడికల్ కాలేజ్ ఒక తలమానికంగా రూపుదిద్దుకునేలా నిర్మాణం చేపడుతాన్నారు. ఎమ్మెల్యే వెంట అధికారులు, నాయకులు ఉన్నారు.

అయ్యోరు లేక...అవస్థలు తప్పక



ఆరమడకలో పాఠశాల వద్ద నిరీక్షిస్తున్న విద్యార్థులు

- తొమ్మిది రోజులుగా పాఠశాలకు తాళాలు
- లబోదిబోమంటున్న విద్యార్థులు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు
- నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్న ఎంఇఒ

ప్రజాశక్తి-వాల్మీకిపురం

మండలంలోని ఆరమడక ఎంపిపి పాఠశాలలో తొమ్మిది రోజులుగా అయ్యోరు లేక విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయుడు అనారోగ్యంతో సెలవు పెట్టారు. ఆ తర్వాత ఇప్పటి వరకు ఏ ఉపాధ్యాయులు ఇక్కడికి రాలేదు. పాఠశాలకు తాళాలు వేయాల్సిన పరిస్థితి నెలకొంది. తొమ్మిది రోజులుగా విద్యార్థులు ప్రతి రోజు పాఠశాల వద్దకు వెళ్లి తాళాలు వేసి ఉండడంతో వరండాలో కూర్చొని, మధ్యాహ్నం భోజనం కూడా లేకపోవడంతో ఆకలితో ఇళ్లు చేరుతున్నారు. తొమ్మిది రోజులుగా పాఠశాల మూత పడి ఉన్నా.. విద్యార్థులకు భోజనాలు పెట్టకపోయినా మండల విద్యాశాఖ ఏ మాత్రం పట్టించుకోకుండా వ్యవహరిస్తున్న తీరుపై గ్రామస్థులు మండిపడుతున్నారు. తనిఖీ చేయాల్సిన ఎంఇఒ నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు అనేకం వినిపిస్తున్నాయి. ఓ ఎంఇఒ విధులకు తాగేసి వస్తుండడంపై సర్వత్రా విమర్శలు చోటు చేసుకుంటున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకొని, పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించాలని గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

మూతపడ్డ అయ్యవారిపల్లి పాఠశాల

మండలంలోని అయ్యవారిపల్లి ఎంపిపి పాఠశాలలో విద్యార్థులు లేకపోవడంతో మూతపడింది. ఇక్కడ పని చేస్తున్న ఉపాధ్యాయుడిని డిప్యుటేషన్‌పై ఎంపిపి పాఠశాల ఆరమడకకు పంపారు. కాగా ఆ ఉపాధ్యాయుడు ఆరమడక పాఠశాలకు హాజరు కావడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

రెగ్యులర్ ఉపాధ్యాయులను నియమించాలి

మండలంలోని ఆరమడక ఎంపిపి పాఠశాలకు డిప్యుటేషన్‌పై నియమించిన ఉపాధ్యాయుడిని రద్దు చేసి రెగ్యులర్ ఉపాధ్యాయులను నియమించాలి రెగ్యులర్ ఉపాధ్యాయులను నియమించి, విద్యార్థులకు మంచి చదువును అందించడంతో పాటు నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని కోరారు. లేకపోతే ఆందోళనలు చేయాల్సి వస్తుంది.

- శ్రీనివాసులు, సిసిఎం జిల్లా కార్యదర్శి, అన్నమయ్య.

ప్రతి ఇంటికి నీరు చేరేలా చూడాలి : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

ప్రతి ఇంటికి నీరు చేరేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ గ్రామీణ నీటి సరఫరా శాఖ ఎస్ఇని ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం రాయచోటి మండలం ఏపిలవంకపల్లి, గొర్లముదీడు గ్రామంలో ప్రతి ఇంటికి నీరు చేరేలా చూడాలని గ్రామీణ నీటి సరఫరా శాఖ ఎస్ఇ ప్రసన్నకుమార్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నీటి ట్రాక్టర్ ఎక్కడ వరకు వెళ్తే అక్కడ వరకు వెళ్లి నీటిని వదిలేలా చూడాలని ఇఇపిఆర్‌డికి తెలిపారు. త్వరలో కాలువలు మంజూరు అయ్యేలా చూస్తానని కలెక్టర్ గ్రామస్తులకు తెలిపారు. కార్యక్రమంలో గ్రామీణ నీటి సరఫరా శాఖ ఎస్ఇ ప్రసన్న కుమార్, ఇఇపిఆర్‌డి, ఎంపిడిఒ, విఆర్ఓ పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్



నిరసన తెలుపుతున్న దళితవాడ ప్రజలు

శ్మశాన భూమి ఆక్రమణకు యత్నం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల పరిధిలోని ములక్కాయలపల్లె హరిజనవాడకు చెందిన సర్వే నెంబర్ 1713లోని 20 సెంట్లు శ్మశాన భూమిని అదే గ్రామానికి చెందిన పెత్తందార్లు ఆక్రమించాలని గురువారం ముళ్లకంచ ఏర్పాటు చేయగా శుక్రవారం హరిజనులు మూకుమ్మడిగా శ్మశానం వద్దకు చేరుకొని ముల్లకంచెను తొలగించారు. ఇంతలో ఆక్రమితదారులు అక్కడికి చేరుకోవడంతో రెండు గ్రూపుల మధ్య వివాదం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువురికి సర్దిచెప్పి సమస్యను రెవెన్యూ కార్యాలయంలో తేల్చుకోవాలని చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. ఈ సందర్భంగా హరిజనవాడ ప్రజలు మాట్లాడుతూ రెవిన్యూ వారు గత ఏడాది తమకు సర్వే నెంబర్ 1713 లో స్మశానం కొకు 0.20 సెంట్లు కేటాయించి ధ్రువీకరణ పత్రాలు కూడా అందజేశారని తెలిపారు. రాజకీయ కక్ష సాధింపులతో పెత్తందార్లు తమ శ్మశాన స్థలం కబ్జా చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం శ్మశాన వాటిక వద్ద తమకు న్యాయం చేయాలని నిరసన తెలిపారు. అక్కడికి పోలీసులు చేసుకుని దళిత కాలనీ వారితో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

21న మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

నిరుద్యోగ యువతకు సదావకాశం కల్పించేందుకు ఈ నెల 21వ తేదీన పట్టణంలో మెగా జాబ్‌మేళాను మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాష చొరవతో ఆయన ఆధ్వర్యంలో స్థానిక ఎన్‌విఆర్ కన్వెన్షన్ హాలులఓ అమర్ రాజా గ్రూప్ ఆఫ్ కంపెనీ వారు జాబ్ మేళా నిర్వహిస్తున్నారు. చిత్తూరు, కరకంబాడి, తేనేపల్లిలో మిషన్ ఆపరేటర్లుగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై ఉండి, ఐటిఐ లేదా ఇంటర్ పాస్ కానీ ఫెయిల్ అయిన యువకులు జాబ్ మేళాకు పాల్గొనవచ్చున్నారు. 18 ఏళ్ల నుండి 35 ఏళ్ల వయసు యువకులు మాత్రమే అర్హులు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు పొందాలని పేర్కొన్నారు.



సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన

ప్రజాశక్తి- కలకడ

డయేరియా, డెంగీ, బిసిజి టీకాలపై గ్రామీణ ప్రాంతాలు ప్రజలకు అవగాహన కల్పించినట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎం.వి కిషోర్ కుమార్‌రెడ్డి తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వారి ఆదేశాల మేరకు మండలంలోని ఎర్రకోటపల్లిలో డాక్టర్ కిషోర్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజలకు స్టాప్ డయేరియా, డెంగీ వ్యతిరేక మాసోత్సవాలు, వయోజన బిసిజి టీకా, కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వేపై హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్‌రఫీ, ఆరోగ్య విస్తరణ అధికారి జయరామయ్య అవగాహన కల్పించామన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ సోమ, గురు వారాలలో అన్ని ఆరోగ్య కేంద్రాల్లో అర్హులైన ఆరు వర్గాలవారికి బిసిజి టీకాలు వేస్తున్నామని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా ముఖ్యంగా చేతులు శుభ్రత పాటించాలని, తాగునీటి కాచి చల్లార్చి తాగాలని, వ్యక్తిగత, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఒఆర్ఎస్ ప్యాకెట్లు అన్ని ఆరోగ్య, అంగన్వాడీ కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని అన్నారు. అనంతరం డెంగీ జ్వరాలు ప్రబలకుండా డ్రైడే డ్రైడే పాటించాలని, కిటికీలకు మెష్ కొట్టించుకోవాలని, ఇంటి పరిసరాలలో నీరు నిల్వ లేకుండా చేసుకోవాలని సూచించారు. అర్హులైన వారికి బిసిజి వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు. స్పర్శ ,నొప్పి లేని మచ్చలు కుష్టు వ్యాధి కావచ్చని ఈ రకపు మచ్చలను నిర్లక్ష్యం చేసిన యెడల రానున్న కాలంలో ఇవే కుష్టు వ్యాధిగా మారవచ్చని అన్నారు. కుష్టువ్యాధి ఇంటింటి సర్వే ఈనెల 18 నుంచి వచ్చేనెల రెండవ తేదీ వరకు నిర్వహిస్తున్నామని ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆరోగ్యపర్యవేక్షకులు వెంకటేస్వరరావు, ల్యాబ్ టెక్నీషియన్ షేక్ జమీల్‌అహ్మద్, ఫార్మసిస్టు షీరీప్‌బాషా, పిహెచ్ఎన్ సుబ్బరత్న, ఎఎన్ఎం.వాణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణంలో చెట్ల ఆకులు రాలి అమాంతం చెత్త పేరుకుపోయింది. విషయం తెలుసుకున్న కమిషనర్ పి.ఆర్.మనోహర్ శానిటేషన్ అధికారి, జూనియర్ అసిస్టెంట్ కిరణ్ ఆధ్వర్యంలో శుక్రవారం పారిశుధ్య కార్మికులచే శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలో మెరుగైన పారిశుధ్యానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ ఆసుపత్రిలో ఆకులు విపరీతంగా పడడంతో దోమలు విపరీతంగా వృద్ధిచెంది ప్రజలు విష జ్వరాల బారిన పడే ప్రమాదం ఉందని అన్నారు. నిరంతరం రోగులు, వారి సహాయకులు ఎక్కువగా వస్తుంటా రన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ ఆస్పత్రిని శుభ్రం చేయించినట్లు తెలిపారు.

మదనపల్లె జిల్లాకు సహకరించండి

ప్రజాశక్తి-రామసముద్రం

మదనపల్లిని జిల్లా చేసేందుకు సహకరించాలని రాజంపేట పార్లమెంటు టిడిపి కోశాధికారి సీతప్ప రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ను కలిసి విన్నవించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువ గళం పాదయాత్రలో నారా లోకేష్ మదనపల్లెలో ఇచ్చిన హామీని గుర్తు చేసినట్లు చెప్పారు. మదనపల్లె వాసుల చిరకాల వాంఛ జిల్లా చేయడమేనని అన్నారు.

శ్రీనివాసులరెడ్డికి మంత్రి 'మండిపల్లి' నివాళి

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని స్థానిక పక్కిరారెడ్డిగారిపల్లికి చెందిన పురం శ్రీనివాసులరెడ్డి శుక్రవారం మృతి చెందడంతో మృతుని భౌతికాయానికి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పూలమాలవేసి నివాళు లర్పించారు. మృతుని తండ్రి హేమ కుమార్‌రెడ్డిని, తల్లి పద్మజాను పరామర్శించి ఓదార్చారు. మృతుడ తండ్రి హేమకుమార్‌రెడ్డి మండల టిడిపి నాయకుడిగా అందరికీ సహకారిగా ఉండడం, మంత్రికి సమీప బంధువు కావడంతో టిడిపి శ్రేణులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. మంత్రి వెంట ఆయన సోదరుడు లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నారాయణరెడ్డి కుమారుడు రాహుల్‌రెడ్డి, మాజీ ఎంపిపి ఆవుల నారాయణరెడ్డి, సర్పంచ్ నారే మల్లికార్జుననాయుడు, మాజీ సర్పంచ్‌లు బికె.మహమ్మద్ రియాజ్, శ్రీనివాసరాజు, భద్రప్ప నాయుడు, ఫరీద్‌బాషా, మాజీ ఎంపిటిసి రెడ్డి ప్రసాద్ రెడ్డి, కాపు సంఘఅధ్యక్షుడు, కుడుముల రమణారెడ్డి, కసిరెడ్డి.వెంకట శివారెడ్డి, నూరుల్లా, వీరరాఘవులు, కొండ్రెడ్డి శ్రీకాంత్ రెడ్డి, మల్‌రెడ్డి, వెంకటశివారెడ్డి మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు మృతుడిని నివాళి అర్పించి వారి కుటుంబానికి సానుభూతిని వ్యక్తం చేశారు.



శ్రీనివాసులరెడ్డి భౌతికకాయానికి నివాళి అర్పిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రభుత్వాలు మారినా ప్రజా సంక్షేమమే ధ్యేయం

- రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథ్‌రెడ్డి



నందలూరు: సమావేశంలో మాట్లాడుతున్న మేడా రఘునాథరెడ్డి

ప్రజాశక్తి-నందలూరు

ప్రభుత్వాలు మారిన ప్రజాసంక్షేమమే ధ్యేయమని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, రాజ్య సభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఎంపిపి మేడా విజయభాస్కర్ రెడ్డి అధ్యక్షతన ఎంపిడిఒ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల అభివృద్ధి కొరకు ప్రతి అధికారి, ప్రజా ప్రతినిధులు సహకరించాలని కోరారు. అనంతరం మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేజించారు. కార్యక్రమంలో ప్రకాష్, డిప్యూటీ తాసిల్దార్ మోహనకృష్ణ, సూపర్నెంట్ సుబ్రహ్మణ్యం, వైస్ ఎంపిపి అనుదీప్, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్‌కు అంతరాయం లేకుండా చూడాలి : ఎంపిపి

ప్రజాశక్తి-కలకడ : మండలంలో విద్యుత్‌కు అంతరాయం లేకుండా చూడాలని ఎంపిపి శ్రీదేవి రవికుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రమైన కలకడ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపిపి మాట్లాడుతూ మండలంలో తరచుగా విద్యుత్‌కు అంతరాయం కలుగుతుండటం వల్ల తాగునీటి బోర్లు మరమ్మతుకు గురి కావడం జరుగుతుందని అన్నారు. విద్యుత్‌కు అంతరాయం లేకుండా సంబంధిత అధికారులు చొరవ చూపి చర్యలు చేపట్టాలన్నారు. మండలంలో వర్షాభావ పరిస్థితుల వల్ల గ్రామీణ ప్రాంత ప్రజలకు సీజనల్ వ్యాధులు వస్తున్నాయని వాటిని అధిగమించేందుకు సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎంపిడిఒ రామకృష్ణారెడ్డి మాట్లా డుతూ మండలంలో తాగునీటి సమస్య లేకుండా చూడవలసిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. ఎపిఒ చెన్నకేశవులు మాట్లా డుతూ పండ్లతోటలు పెంచడానికి రైతులు ఆసక్తి చూపాలని హార్టికల్చర్ ద్వారా రైతులకు 16 రకాల పండ్ల చెట్లను అందిస్తామని చెప్పారు. ఆవులు, గొర్రెలు, సిరికల్చరల్ షెడ్లను వేసుకోవడానికి రైతు పదిశాతం ఖర్చు పెట్టుకుంటే, ఉపాధి ద్వారా 90 శాతం లబ్ధి చేకూరుతుందని తెలిపారు. బాలయ్య పల్లి సర్పంచ్ విశ్వనాథ నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇంటి నిర్మాణాలు చేపట్టకుండా అదనంగా స్థలాలను ఆక్రమించుకొని ఇంటి నిర్మాణాలు చేపట్టారని దీనికి మీరు ఏమి సమాధానం చెప్తారని హౌసింగ్ ఎఇ రమణయ్య ను నిలదీశారు. ఇందుకు హౌసింగ్ ఎఇ మాట్లాడుతూ స్థానిక రెవెన్యూ అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. మండలంలోని బాలయ్యగారిపల్లి పంచాయతీ ఎంపిటిసి ఆచూకీ తెలపాలని స్థానిక ఎంపిపి, ఎంపిడిఒలను అడిగారు. ఎంపిడిఒ మాట్లాడుతూ మండల సర్వసభ్య సమావేశానికి మూడు సమావేశాలకు హాజరు కాకపోతే వారిపై ఉన్నతా ధికారులకు నివేదికలు పంపడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు ఇకెవైసి తప్పనిసరిగా చేయాలని ఇందుకు సచివాలయంలోని సిబ్బంది తమకు సహకరించాలని ఎంఇఒ రామచంద్రారెడ్డి సంబంధిత సచివాలయం సిబ్బందిని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ రామకృష్ణారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, కో-ఆప్షన్ సభ్యులు, ఎపిఎం రమేష్, కలకడ, ఎర్రకోటపల్లి వైద్యాధికారులు మల్లికార్జున, జవహర్‌బాబు, ఎంపిహెచ్ఇఒ జయరామయ్య, నడిమిచర్ల పశువైద్యాధికారిని పూర్ణిమ, ట్రాన్స్‌కో ఎఇ వరప్రసాద్, ఎస్‌బిఐ హెడ్ కానిస్టేబుల్ చంగల్ రాయుడు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి శ్రీదేవి రవికుమార్

మట్టి విగ్రహాలను ప్రోత్సహించాలి : ఆర్‌డిఒ



బి.కొత్తకోట : మట్టివిగ్రహాల తయారీని పరిశీలిస్తున్నకమిషనర్

ప్రజాశక్తి-ములకలచెరువు

త్వరలో రానున్న వినాయక చవితి పండుగ సందర్భంగా ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలు ఏర్పాటుకు ప్రోత్సహించాలని మదనపల్లి ఆర్డివో హరిప్రసాద్ సూచించారు. శుక్రవారం ములకలచెరువు తాసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం కార్యాలయంలోని రికార్డును పరిశీలించి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ నెలలో జరిగే వినాయక చవితి పండుగ సందర్భంగా స్థానికంగా వినాయక విగ్రహాలు తయారు చేసే నిర్వాహలకు మట్టి విగ్రహాలు ఏర్పాటు చేసే విధంగా అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో సచివాలయం సిబ్బంది ద్వారా మట్టి విగ్రహాలపై అవగాహన సదస్సు నిర్వహించాలన్నారు. జిల్లాలో నీటి వనరులు ను పరిరక్షించేందుకు మట్టి విగ్రహాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ అనిల్ కుమార్, ఎంఈఒ వెంకటరమణ, అర్ఐ వీరాంజనేయులు, సిబ్బంది చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పిఒపి వినాయక బొమ్మలు తయారు చేయొద్దు : కమిషనర్

ప్రజాశక్తి-బి.కొత్తకోట : నగర పంచాయతీ పరిధిలో గల మట్టి బొమ్మలు చెయ్యు కళాకారులకు బి.కొత్తకోట మునిసిపల్ కమిషనర్ పి.ఆర్.మనోహర్ పలుసూచనలు, సలహాలు ఇచ్చారు.పర్యావరణానికి హాని చేసే కారకాలతో తయారు చేసిన విగ్రహాలను ఉపయోగించిన యెడల విగ్రహం విలువపై 200 శాతం అపరాధ రుసుము విధిస్తూ చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. పర్యావరణానికి హాని చేసే కారకాలతో అనగా ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, సింథటిక్ పెయింట్లు వంటి వాటిని ఉపయోగించి విగ్రహాలను తయారు చేయవద్దని సూచించారు. వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేయు మండపలకు మున్సిపాలిటీ నుంచి ముందుగానే అనుమతి పొందవలెనని, మట్టి విగ్రహాలు పెట్టే మండపాలకు మాత్రమే అనుమతిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎఇ రాజేంద్ర, జూనియర్ అసిస్టెంట్ కిరణ్ కుమార్, సందీప్ పాల్గొన్నారు.

గ్రామీణ బ్యాంకు మార్పు

ప్రజాశక్తి-రామసముద్రం

మండలంలోని చెంబకూరు గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామీణ బ్యాంకు వేరొక చోటికి తరలించి మార్పు చేస్తున్నట్లు బ్యాంకు మేనేజర్ వినోద్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఖాతాదారుల సౌకర్యం కోసం ప్రస్తుతం ఉన్న చోట నుంచి కొత్తూరు గ్రామానికి వెళ్లే రోడ్డు లోకి బ్యాంకును ఏర్పాటు చే స్తు న్నట్లు చెప్పారు. ఈనెల 21 సోమవారం బ్యాంక్ చైర్మన్ ప్రసాద్ జనరల్ మేనేజర్ ప్రభాకరన్ రీజనల్ మే నేజర్ ప్రకాష్ రత్న బాబు బ్యాంకును ప్రారంభిస్తారన్నారు. ఖాతాదారులు గమనించాలని కోరారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-రామసముద్రం

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని మండల టిడిపి అధ్యక్షులు గౌని వారి విజయకుమార్ గౌడ్ తెలిపారు. శుక్రవారం రామసముద్రం ముల్బాగల్ రోడ్డు నుండి శీతరగానిపల్లి రోడ్డుకు మట్టి రోడ్డు పనులకు విజయ్ కుమార్ గౌడ్ పూజ చేసి పనులు ప్రారంభించారు. నాలుగు లక్షల రూపాయలతో పనులు చేపడుతున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి సంక్షేమంపై దృష్టి సారించిందని అన్నారు. గత ప్రభు త్వం కొన్ని రాజకీయ కారణాల వల్ల గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకుండా చేసిందని తెలిపారు. కార్యక్రమంలో సుబ్ర హ్మణ్యం, శ్రీరాములు, కృష్ణప్ప, జయరాజ్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

సంఘమిత్రలు తీరు మార్చుకోవాలి

ప్రజాశక్తి-రామసముద్రం

సంఘమిత్రలు తీరు మార్చుకోకుంటే ఇంటికి వెళ్లాల్సిందేనని డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సంఘమిత్రలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో చాలామంది సంఘ మిత్రుల పనితీరు అధ్వానంగా ఉందని చెప్పారు. మహిళలకు వ్యక్తిగత రుణాలు లక్ష నుండి 5 లక్షల వరకు తీసుకునేందుకు ప్రోత్సహించాలని తెలిపారు. లోకోష్ యాప్ లో సంఘాలను ఆన్‌లైన్ చేయని సంఘమిత్రలకు జీతాలు నిలుపుదల చేయాలని ఎపిఎం సుబ్రమణ్యంకు సూచించారు. పనితీరు మెరు గుపరుచుకోవాలని సంఘాల మరింత బలోపేతం చేయాలని అన్నారు. అప్పుల రికవరీ మరింత మెరుగ్గా ఉండేవిధంగా చూడాలన్నారు

'ఉపాధి' పనులపై సామాజిక తనిఖీ ప్రజా వేదిక

ప్రజాశక్తి-రామసముద్రం : ఉపాధి హామీ బహిరంగ సామాజిక శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగింది. 2023 మార్చి నుంచి 2024 ఏప్రిల్ వరకు మండల వ్యాప్తంగా జరిగిన ఉపాధి హామీ పనులపై బహిరంగ సభ జరిగింది. ఇందులో 1620 పనులకు గాను రూ.5.92లక్షలు ఖర్చు చేసినట్లు తెలిపారు ఉపాధి సిబ్బంది నుంచి 38,942 ఆర్‌డబ్ల్యూఎస్ 6875 రైతుల నుంచి రూ.68,540 రికవరీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డ్వామా పీడీ మద్దిలేటి, డిఆర్‌డిఎపిడి సత్యనారాయణ అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్ ప్రకాష్, ఎంపిపి కుసుమకుమారి, ఎంపిడిఒ , భాను ప్రకాష్, ఎపిఒ గౌరీశంకర్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని నాణ్యతగా అందించాలి : జెసి

ప్రజాశక్తి-కలికిరి : విద్యార్థులకు మధ్యాహ్నన భోజనాన్ని నాణ్యతగా అందించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలో ఆయన పాఠశాలలు, సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సంద`ర్భంగా ఇస్కాన్ పంపుతున్నటువంటి భోజనం పిల్లలకు సరిపోవట్లేదని సంబ ంధిత అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. ఆహారం తక్కువుగా ఉందదని, కూరలు కూడా సరిపోయినంత లేవని ఎంఇఒ, ప్రధానోపాధ్యా యులు మీద ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం గురుకుల పాఠశాలలో భోజన పథకాన్ని తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. సచివాలయం-1లో రికార్డుల పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డు తూ సమ యపాలన పాటించి ప్రజా సమస్యలు త్వరితిగతిన పరిష్కరించాలని ఆదే శించారు. పెండింగ్‌లో ఉన్న కుల ధృవీకరణ పత్రాలు సుమోటో కింద త్వరి తగతన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మర్రికుంటపల్లి సచి వాల యాన్ని తనిఖీ చేసి రికార్డుల పరిశీలించి సచివాలయ సిబ్బందికి సమ యపాలన పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి రామకృష్ణ, తహశీల్దార్ విజయకుమారి పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

సమస్యల పరిష్కారానికి సిఎం హామీ : 'ముక్కా'

ప్రజాశక్తి-రైల్వేకోడూరు



సిఎంకు సమస్యలను వివరిస్తున్న రూపానందరెడ్డి

రైల్వే కోడూరు నియోజక వర్గంలోని దీర్ఘకాలిక సమస్యల పరిష్కా రానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారని టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపా నందరెడ్డి పేర్కొన్నారు. ఈ సంద ర్భంగా రూపానందరెడ్డి మాట్లా డుతూ నియోజకవర్గంలో అభివృద్ధి పనుల కోసం విజయవాడలోని సిఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసి దీర్ఘకాలిక సమస్యలైన రైల్వేకో డూరు ఆర్‌టిసి బస్టాండ్, గాలేరి నగరి సుజల స్రవంతి పెండింగ్ పనులు, రోడ్ల అభివృద్ధి అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ, కోడూరు-వెంకటగిరి రోడ్డు పనులు, కోల్డ్ స్టోరేజి తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు హామీ ఇచ్చారని తెలిపారు.

వీరబల్లిలో కిలో టమోటా రూ.100

ప్రజాశక్తి-వీరబల్లి : టమోటా ధరలు ఠారెత్తిస్తున్నాయి. వీరబల్లి అంగళ్లలో కిలో టమోటా ధర రూ.100 వరకు పలుకుతుండడంతో వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు. గత నెలలో కిలో రూ.40 నుంచి 50 వరకు ఉండేది. దీని ధర అమాంతంగా సగాని సగం ధర పెరిగింది. ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి లేకపోవడంతో ధరలు పెరగాయని వ్యాపారస్తులు చెబుతున్నారు. మండలంలో టమోటా సాగు లేకపోవడం, వారపు సంత జరగకపోవడంతో ఆ ప్రభావం ధరలపై పడిందని పలువురు పేర్కొంటున్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

ఆటో డ్రైవర్లు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దని హెడ్ కానిస్టేబుల్ చక్రవర్తి అన్నారు. శుక్రవారం నిమ్మనపల్లి బస్టాండ్ కూడలిలో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. బస్టాండ్ కూడలిలో ఆటోలను ఇష్టానుసారం నిలిపి ఆర్‌టిసి బస్సులకు, లారీలకు, ఇతర ప్రయివేట్ వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆటో స్టాండ్‌లో కేవలం సీరియల్ ప్రకారం రెండు ఆటోలను మాత్రమే నిలపాలని, మిగిలిన ఆటోలను ఇదివరకే చూపించిన బయట స్థలంలో నిలపాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలను నడిపినా తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్సు, వాహనాల ధ్రువీకరణ పత్రాలను, యూనిఫామ్ ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ చక్రవర్తి, కానిస్టేబుల్ రామచంద్ర పాల్గొన్నారు.

క్రైం కార్నర్



నిందితుడి అరెస్టును చూపుతున్న పోలీసులు

తండ్రిని హత్యచేసిన కుమారుడు అరెస్టు : డిఎస్‌పి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆస్తిలో వాటా పంచలేదని కక్ష పెంచుకున్న కన్నకొడుకే తండ్రిని కారుతో ఢీకొట్టి హత్య చేశాడని డిఎస్‌పి ప్రసాద్‌రెడ్డి తెలిపారు. మదనపల్లె వీవర్స్ కాలనీ వద్ద గురువారం జరిగిన నీరుగట్టుపల్లెకు చెందిన వడ్డీవ్యాపారి చిన్నాఒడ్డెప్పరెడ్డి హత్య కేసులో శుక్రవారం మృతుని కొడుకు నిందితుడు రఘునాథరెడ్డిని స్థానిక అన్నమయ్య సర్కిల్లో సీఐ, ఎస్ఐ వెంకటసుబ్బయ్య లు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా స్థానిక రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో డిఎస్‌పి ప్రసాదఒడ్డి నిందితుడి వివరాలను వెల్లడించారు. నిందితుడు రఘునాథ్‌రెడ్డి ఆన్ లైన్ ట్రేడింగ్‌లో షేర్స్ కొనడం, అమ్మడం ద్వారా చాలా వరకు నష్టపోయాడని చెప్పారు. ఇందుకోసం సుమారు రూ. 16 లక్షలకు పైగా అప్పులు చేశాడని అన్నారు. అప్పు తీర్చే మార్గం లేక తన తండ్రిని ఆస్తిలో వాటా కోరాడని, ఆస్తిలో వాటా ఇవ్వనని తండ్రి చెప్పడంతో అప్పులు తీర్చే మార్గం లేక చివరకు కన్న తండ్రిని కారుతో గుద్ది చంపినట్లు తెలిపారు. మృతుడి చిన్న కుమా రుడు శంకర్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి హత్య చేసిన రఘునాథరెడ్డిని అరెస్టుచేసినట్లు తెలిపారు. హత్యకు ఉపయోగించిన కారును సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సిఐ యువరాజు, ఎస్ఐ వెంకటసుబ్బయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అప్పులబాధతో ఫైనాన్స్ ఉద్యోగి ఆత్మహత్య

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



ఆనందరెడ్డి(ఫైల్ ఫొటో)

అప్పుల బాధతో ఓ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలో పనిచేసే ఉద్యోగి ఆత్మ హత్య చేసుకున్నాడు. ఈ సంఘటన గురువారం అర్ధరాత్రి మదనపల్లె పట్టణంలో జరిగింది. రెండో పట్టణ సిఐ యువరాజు, ఎస్ఐ వెంకట సుబ్బయ్య తెలిపిన వివ రాల మేరకు.. పిటిఎం మండలం, పిడింవారిపల్లెకు చెందిన నాగిరెడ్డి కుమారుడు ఆనందరెడ్డి(41) మదనపల్లె వైఎస్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఇతనికి భార్య లక్ష్మి, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. గతంలో ఇతను పట్టణంలోని ఇండస్ ప్రయివేట్ బ్యాంకులో బ్రాంచ్ మేనేజర్ గా పని చేసేవాడు. ఆ సమయంలో పలు వురి వద్ద భారీగా అప్పులు చేశాడని తెలిపారు. సుమారు రూ. 20 లక్షలకు పైగా అప్పుల్లో కూరుకుపోయాడని, అక్కడ ఉద్యోగం మానేసి ఇటీవల్ కనకదాస్ ప్రయి వేట్ ఫైనాన్స్ కంపెనీలో చేరాడని అన్నారు. తక్కువ జీతం కావడంతో కుటుంబ పోషణ కష్టంగా మారడంతో అప్పులు తీర్చలేకపోయాడని అన్నారు. అప్పు ఇచ్చిన వారి నుంచి ఒత్తిడులు ఎక్కువ కావడంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యారని అ న్నారు. అప్పు తీర్చే మార్గం లేకపోవడంతో రాత్రి భార్య బిడ్డలు నిద్రపోయాక ఇంటి పైన గదికి వెళ్లి మోల్డింగ్ కమ్మికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని అన్నా రు. భర్త పడకగదిలో లేకపోవడాన్ని గమ నించిన అతని భార్య పై గదిలోకి వెళ్లి చూడగా భర్త ఉరికి వేలాడుతూ కనబడ్డాడని చెప్పారు. ఆమె గట్టిగా కేకలు వేయ డంతో స్థానికులు, బంధువులు వచ్చి పోలీసులకు సమా చారం అందించారని అప్పులే కాకుండా మరేమైనా కారణాలు ఉన్నాయోమోనని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.